# జ్వాల

ద్విభాష్యం రాజేశ్వరరావు



"ట్రింగ్ .... ట్రింగ్ ...."

కుర్చీలో కూర్చొని ఫోనువంక తదేకంగా చూస్తున్న రమ ఉలిక్కిపడింది. మెల్లగా వణికే చేతిని ఫోన్‌మీద వుంచింది. రిసీవర్‌ని చేతివేళ్ళతో నొక్కిపట్టింది.

ట్రింగ్‌మంటున్న శబ్ద ప్రకంపనాలు చేతివేళ్ళ చిగుళ్ళలోంచి నరాల్లోకిపాకి రక్తంతోబాటు శరీరంనిండా విండి పోతున్నట్లనిపించింది.

"ట్రింగ్ .... ట్రింగ్ ...." బెల్ తదేకంగా మోగుతోంది.

రిసీవర్ తియ్యాలా? వద్దా?

గోడగడియారం వంక చూసిందిరమ! సరిగ్గా అయిదునిమిషాల తక్కువఅయిదు!

అతడే! సందేహంలేదు!

ఫోను చేస్తున్నది రవీంద్రే!!

ఏదో నిశ్చయానికి వచ్చినట్లు మనస్సు ఉగ్గబట్టుకొని రిసీవర్ 'క్రేడిల్' మీద నుండి తియబోయింది.

కాని— బెల్ ఆగిపోయింది!

మెల్లగా రిసీవర్ మీదినుండి చెయ్యి తీసేసింది. నుదుటన పట్టిన చెమటను దుమాలుతో ఒత్తుకుంది.

తను పొరపాటు చేసిందా?

'నిశ్చయంగా పొరపాటే!' అని అంతరాత్మ చెప్తోంది.

అదృష్టం చేయిజారిపోయినట్లనిపించింది.

మనసు బాధగా మూలిగింది!

మరుక్షణంలో ఆకర్షణీయమైన రవీంద్రముఖం గుర్తుకు వచ్చింది. అందమయిన అతనికళ్ళు గుర్తుకు వచ్చేయి. తీయని మాటలు గుర్తుకు వచ్చేయి. అంతలోనే తాను చేయవలసిన తప్పుకూడా గుర్తుకువచ్చింది! ఎటూ తేల్చుకోలేకపోతోంది రమ!

సరిగ్గా, అయిదు తక్కువ అయిదుకు అతడు ఫోన్‌చేస్తానన్నాడు. ఆసమయానికి ఫోన్ దగ్గరే ఉండమన్నాడు. నిజంగా తనకు ఇష్టంలేకపోతే, నాలుగూ నలభై నిమిషాలనుండీ 'వార్డెన్' గదిలో ఫోను ముందు కూర్చుని ఎందుకు నిరీక్షిస్తున్నట్టు?

తాను చేయబోయే పని తప్పేఅయినా, అవసరార్థం చేయమని మనసు పురిగొల్పుతోంది.

ఫోనువంక చూసింది రమ! మళ్ళీ మోగితే బాగుండును!

ఈసారి తప్పక ఫోన్ తియ్యాలి! తన అంగీకారాన్ని రవీంద్రకు తెలియజేయాలి.

అసలు ఇలా ఎందుకు జరుగుతోంది? రవీంద్ర ఆకర్షణకు తాను లోనయింది!

ఆలోచిస్తున్నకొద్దీ మనసు బరువెక్కిపోతోంది.

మూడు రోజుల క్రితం—

తాను చేస్తున్న టెంపరరీ ఉద్యోగం కాస్తా ఊడిపోయింది,

"రేపటినుండి నువ్వు రానక్కరలేదమ్మా! మళ్ళీ అవసరమయితే తప్పకుండా నిన్నే పిలుస్తాం," అంటూ ఆఫీసు మేనేజరు దశరథరామయ్య గారు తనకు ఆవేళ్టివరకూ రావాల్సిన జీతం లెఖ్ఖచూసి తన చేతుల్లో పెడుతూ వుంటే కన్నీళ్ళు తిరిగేయి రమకు!

"సారీ రమా! ఈపరిస్థితిలో నేనేమీ చెయ్యలేను! సహాయం చేద్దామన్నా నా చేతిలో ఏమీలేదని నీకూ తెలుసు" అని కొంతసేపు మాట్లాడటం ఆపి దీర్ఘంగా నిట్టూర్చి "'రవీంద్ర సీఫుడ్స్' ప్రొప్రయిటరు రవీంద్ర మా అబ్బాయితో కలిసి చదువుకున్నాడు. అతనికి ఉత్తరం రాసి ఇస్తాను, తీసికెళ్ళు! నీ అదృష్టం బాగుంటే, అతనేమయినా సాయం చేయగలడు...." అంటూ ఓ ఉత్తరం రాసి తనకు అందించేడు.

తాను దాన్ని వణికేచేతుల్లో అందుకుని కృతజ్ఞతాపూర్వకంగా ఆయనకు

రెండుచేతులూ జోడించి నమస్కరించి "మీ మేలు మరచిపోలేను!" అంటూ రూముకు వచ్చేసింది.

తాను వుండేది వర్కింగ్ వుమెన్స్ హాస్టలులో! తన ఉద్యోగం ఊడిపోయిందని తెలియగానే వెంటనే తనను గది ఖాళీచేయమని చెప్పింది వార్డెన్. "అర్థాంతరంగా ఎక్కడికి వెళ్లగలను. కొద్దిరోజుల్లో ఏదో ఒక ఉద్యోగం చూసుకుంటాను." అంది రమ.

"అదేం కుదరదు! నువ్వింతగా ప్రాధేయపడుతున్నావు కనుక ఓ వారంరోజులు గడువిస్తాను. మళ్ళీ బుధవారంనాటికి నువ్వు గది ఖాళీచేయాలి. ఇది కేవలం ఉద్యోగినులకు మాత్రమే అని మరో మారు జ్ఞాపకంచేస్తున్నాను." అంది

ఉద్యోగం పోవటంతో తన పరిస్థితి చాలా ఘోరంగా తయారయిందనుకుంది ఉద్యోగినులు కానివాళ్ళందరూ వ్యభిచారులన్నట్లు మాట్లాడుతోంది వార్డెన్. ఏం చేయటం?

వెంటనే దశరధరామయ్యగారి ఉత్తరంతో 'రవీంద్రా సీఫుడ్స్'కు వెళ్ళి ఏదో ఉద్యోగం సంపాయించుకోవటం తప్ప వేరేమార్గం కనుపించలేదు.

ఈ హాస్టలులో వుండటానికే కాదు, తన జీవితం గడపటానికి కూడా మరో మార్గంలేదు. మరునాడే రవీంద్రా సీఫుడ్స ఆఫీసుకు వెళ్ళింది.

• • •

"ప్లీజ్! కమిన్!"

ఎయిర్‌కూల్డ్ గదిలోకి బెదురుగా అడుగుపెట్టి మెల్లగా నడుస్తూ ఎదురుగా రివాల్వింగ్ చైర్‌లో కూర్చున్న రవీంద్రకు నమస్కరించింది. చిరునవ్వుతో నమస్కారం అందుకొని "అలా కూర్చోండి" అంటూ కుర్చీ చూపించేడు.

"పర్వాలేదండీ!" అంటూ టేబిలు ప్రక్కనే నిలబడి బేగ్‌లోంచి ఉత్తరం తీసి "దశరధరామయ్యగారు మిమ్మల్ని కలవమన్నారు...." అంటూ అందించబోయింది.

"ముందు అలా కూర్చోండి!" అన్నాడు రవీంద్ర కళ్ళతోనే కుర్చీ చూపిస్తూ.

ఇక తప్పదన్నట్లు కూర్చుంది రమ.

రవీంద్రకు సుమారు ముప్పయి రెండేళ్ళుంటాయి. తెల్లగా, ఆరోగ్యవంతంగా వున్నాడతను. కళ్ళు చాలా చలాకీగా వున్నాయి. నవ్వుతూ వుండే ముఖంతో చాలా ఆకర్షణీయంగా కూడా వున్నాడు.

"నా పేరు రమ! వర్కింగ్ వుమెన్స్-హాస్టల్లో వుంటున్నాను!" అంది సంభాషణ ఆరంభిస్తూ.

"నైస్ మీటింగ్ యూ! ఇంతకీ ఆ ఉత్తరం దేనికి?" అన్నాడు రవీంద్ర చేతిలోని గుండుసూదిని పిన్‌కుషన్‌మీద గుచ్చుతూ.

"నేను మొన్నటిదాకా లాల్ అండ్ కంపెనీలో క్లార్కుగా పనిచేశాను. కాని అది టెంపరరీ జాబ్! మొన్ననే రిట్రెంచ్ చేశారు. ఉద్యోగం లేకపోతే నాకు వేరే జీవనాధారం ఏమీలేదు. మీ వద్దకు వెళ్ళి ఈ ఉత్తరం ఇస్తే మీరు సాయంచేస్తారని చెప్పేరు దశరధరామయ్యగారు...." అంటూ ఆగింది.

"ఆయన మీ కేమవుతారు?"

"ఏమీ అవరు! నా మీదవున్న వాత్సల్యంకొద్దీ ఉత్తరం ఇచ్చేరు!"

"మీ రెంతవరకూ చదువుకున్నారు?"

"బియ్యే ప్యాసయ్యాను. ప్రయివేటుగా ఎమ్మేచేస్తున్నాను" అంది రమ.

"మీరీ ఉత్తరం ఎందుకు తెచ్చేరు?"

అర్థంకానట్లు అతనివైపు చూసింది. అతనికళ్ళు చిలిపిగా చూస్తున్నాయి. పెదాలు గీతల్లా విడి ఏదో రహస్యం మాట్లాడుతున్నట్లున్నాయి.

"... మీ అందమైన కళ్ళే మీకు రికమండేషన్ లెటర్లు...."

రమ సిగ్గుతో తల దించుకుంది.

అయినా, రవీంద్ర అలా మాట్లాడుతూ వుంటే చాలా ఇరుకున వున్నట్లు అనిపించింది.

"నిజం రమా! మీరు చాలా అందంగా వుంటారు. ఐ లైక్ బ్యూటిఫుల్ గార్ల్స్!"

"థేంక్స్!" అనటం తప్ప ఏమీ సమాధానం చెప్పలేకపోయింది. తన అందాన్ని ఎదుటివ్యక్తి మెచ్చుకుంటున్నందులకు ఒకవంక గర్వంగా వున్నా-తనవైపు తినేసేటట్లు చూసే అతడి చూపులకు మాత్రం ఇబ్బందిగా వుంది.

"మిస్ రమా ....!" అంటూ అతడు క్షణంసేపు ఆగి "ఐ థింక్ ఐయామ్ రైట్!...." అన్నాడు.

"యస్ సార్! మిస్ రమా!" అంది

"రమా! మీకిపుడు ఉద్యోగం కావాలి అంతేనా?"

అంతేనన్నట్లుగా అతనివంక చూసింది.

"మీరు సాయంకాలం హోటల్ కిన్నెరకు రండి. అప్లికేషను అక్కడే తీసుకుంటాను. త్రీస్టార్స్‌లో డిన్నరు తీసుకుందాం! మీకు అభ్యంతరం లేకపోతే రాత్రికి కిన్నెరలో వుండిపోయి రేపు ఉదయం హాస్టలుకు వెళ్ళిపోదురుగాని...." చాలా కాజువల్‌గా చెప్పేడు రవీంద్ర.

రమ మొహం కందగడ్డలా మారిపోయింది. కోపంతో ఆమె పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

తీక్షణంగా రవీంద్రవంక చూసింది.

అతనిలో ఏమాత్రం చలనం లేదు!

అంతలోనే సిగ్గుతో తల దించుకుంది!

మళ్ళా రవీంద్రే అన్నాడు "ఇటీజ్ ఎ డీల్! అంతే! మీకు అవసరం అనుకుంటే రావచ్చు! లేకపోతే ఈ విషయం మరిచిపోండి. మీ నిర్ణయం వెంటనే చెప్పనక్కర లేదు. మీరు వర్కింగ్ వుమెన్స్ హాస్టల్లో వుంటున్నారు కదా! ఆ ఫోనునెంబరు నా దగ్గిర వుంది.

సరిగ్గా ఈ సాయకాలం అయిదునిముషాల తక్కువ అయిదుకి ఆఫీసు విడిచిపెట్టే ముందు మీకు ఫోన్‌చేస్తాను. ఆలోచించుకుని మీ నిర్ణయం చెప్పండి ఐ లైక్ యూ రమా!" అన్నాడు. మౌనంగా లేచి టేబిలుమీది బేగు అందుకొని వడిగా అడుగులు వేసుకుంటూ బయటకు వచ్చేసింది రమ.

ఆ మధ్యాహ్నం భోజనం సంగతి కూడా మరచిపోయి ఆలోచనల్లో మునిగిపోయింది. రూమ్మేటు 'జ్వాల' అడిగింది.

"ఏమిటి రమా? అంత తీవ్రంగా ఆలోచిస్తున్నావ్?"

"మా దూరపు బంధు వొకాయన ఈ వేళ రాత్రి వాళ్ళింటికి భోజనానికి రమ్మన్నారు. యూనివర్సిటి అవతల వుంది వాళ్ళిల్లు! రాత్రి తిరిగి రావటమా, లేక అక్కడే వుండిపోయి ఉదయం రావటమా? అవి ఆలోచిస్తున్నాను." అని ఒక క్షణం ఆగి ఏదో నిశ్చయానికి వచ్చినట్లు "నేను రాత్రికి రాకపోతే ఈ విషయం వార్డెనుకి చెప్పు!" అంది.

"అలాగే!" అంటూ బయటకు వెళ్ళి "నీ ఉద్యోగ ప్రయత్నం ఎంతవరకూ వచ్చింది?" అని అడిగింది.

"రవీంద్రగార్ని కలిసేను. రెండు మూడు రోజుల్లో మళ్ళీ కబురు చేస్తానన్నారు!" అంటూ అబద్ధం ఆడేసింది.

"గుడ్‌లక్!" అంటూ వెళ్ళిపోయింది జ్వాల.


ప్రస్తుతం తన ఉనికిని స్థిరపరచుకునేందుకు ఉద్యోగం చాలా అవసరం. రవీంద్ర దగ్గరకు వెళ్ళక తప్పదు!

"ఇటీజే డీల్! జస్ట్ ఎ గేమ్! అంతే!" అనుకొంది.

* * *

టెలిఫోన్ బెల్ మళ్ళీ మ్రోగటంతో ఈ లోకంలోకి వచ్చిపడింది రమ. చుట్టూ పరికించి చూసింది!

జోక్ వెయ్యటం అంటే నా విషయంలో నిజం చెప్పటమని అర్థం. ప్రపంచంలో 'నిజం' చెప్పడాన్ని మించిన జోక్ మరొకటి లేదు. (బెర్నార్డ్‌షా)




గదిలో ఎవరూ లేరు.

గోడకున్న గడియారం సరిగ్గా అయిదు గంటలు చూపిస్తోంది.

గుండె దిటవుచేసుకుని వణికేచేతుల్తో ఫోను రిసీవరు ఎత్తి చెవిదగ్గర వుంచుకుంది.

మెల్లగా "హలో!" అంది.

"మిస్ రమా!" అవతలి కంఠం రవీంద్రది.

"రమనే మాట్లాడుతున్నాను" వణికే కంఠంతో అంది.

"సారీ, అయిదు నిమిషాలు ఆలస్యం అయింది. అయినా మీరు ఫోన్‌దగ్గరే వుంటారని నాకు తెలుసు...."

"ఎలా తెలుసు?" అడగకూడదనుకుంటూనే అడిగింది.

"నిన్న మీ అందమయిన కనులు చెప్పేయి.... సరిగ్గా ఏడు గంటల ముప్ఫయి నిముషాలకు కిన్నెరహోటలు ముందు లాన్స్‌లో వుంటాను అక్కడ కలుద్దాం."

"అలాగే...." అంటూ ఇంకా ఏదో మాట్లాడబోయింది.

అవతలివైపున ఫోన్ పెట్టేసిన చప్పుడు!

రిసీవరు 'క్రేడిల్' లో వుంచి లేచి బయటకు వచ్చింది.

* * *

ఆ రాత్రి సరిగ్గా ఏడుగంటల ఇరవై అయిదు నిముషాలకు హోటల్ కిన్నెర ముందు ఒక ఆటో ఆగింది. అందులో నుండి తడబడే అడుగులతో దిగిన అమ్మాయి పేరు రమ!

ఆ మరునాడు ఉదయం ఆరుగంటలకు వర్కింగ్ వుమెన్స్ హాస్టల్‌ముందు రిక్షాలోంచి నీరసంగా దిగి తల వొంచుకుని మెల్లగా అడుగులు వేసుకుంటూ వరండా దాటి గదులవైపు వెళ్ళిన అమ్మాయి పేరు కూడా రమే!

* * *

"మూడురోజుల నుండి చూస్తున్నాను. నువ్వు మనిషివి మారిపోయావు. ఉద్యోగం పోయిందని తెలిశాక కూడా రెండురోజులు బాగానే ఉన్నావు. మళ్ళీ నీకేం పట్టుకుందో నాకు అర్థంకావటం లేదు." అంటూ రమ రెండు భుజాలు పట్టుకుని కుదుపుతూ అడిగింది జ్వాల. కన్నీళ్ళు తెలియకుండా ముఖాన్ని

దిండులో దాచేసుకుంది రమ.

“రమా! నీకు సహాయం చేయలేక పోయినా కనీసం సానుభూతి చూపించ గలను. రెండేళ్ళుగా రూమ్‌మేట్సుగా వుంటున్నాం మనం. అన్ని విషయాలూ మనసు విప్పి మాట్లాడుకుంటున్నాం. కాని నువ్వు ఈ మూడు రోజులుగా నా దగ్గిర ఏదో దాస్తున్నావు. నీకంత పరాయి దాన్నయిపోయానా?” నిష్ఠూరంగా మాట్లాడింది జ్వాల.

మెల్లగా తలఎత్తి చూసింది రమ.

ఆమె బుగ్గలనిండా చారికలు కట్టిన కన్నీళ్ళు!

కళ్లువాచి ఎర్రగా నిప్పుల్లావున్నాయి.

“మై గాడ్! ఎందుకీ కన్నీళ్లు! ఏమయిందని అడిగితే. మాట్లాడవేం?” అంది జ్వాల రమ భుజాలమీద అనునయంగా రాస్తూ. వాత్సల్యంతో కూడిన ఆ స్పర్శకు తట్టుకోలేక భోరున ఏడ్చేసింది రమ.

రెండు నిమిషాల తర్వాత “రమా? ఏంజరిగిందో నాతో చెప్పవూ?” అంది జ్వాల ఓదార్పు ధోరణిలో.

ఉద్యోగం పోయిన తర్వాత తాను రవీంద్రవద్దకు వెళ్ళినప్పటినుండి జరిగిన సంగతులన్నీ ఏడుపు మధ్యలో ఎక్కిళ్ల మధ్యలో వివరించి చెప్పింది తను.

“సారీ! ఆ రోజు నీతో అబద్ధం ఆడేను. నిజం చెప్పటానికి ఆ రోజు మనస్కరించలేదు.... నేను చెడిపోయాను జ్వాలా? ఇంక నేను ఎవరికీ పనికి రాను....” అంది.

జ్వాల కొంతసేపు ఏమీ మాట్లాడ లేదు.

“నేనంటే అసహ్యంగా వుందా జ్వాలా?” అడిగింది రమ.

“అసహ్యం ఎందుకు? బహుశః నీ స్థానంలో నేనువున్నా ఇలాగే జరిగి వుండేది. దరిద్రం ఎంత విషాదస్థితికి తీసుకువెళ్తుందో నేను చిన్నతనంలో రుచిచూశాను రమా: ఈ సంఘటన ఒక పీడకలగా మరిచిపో!” సముదాయింపుగా చెప్పింది.

“మరిచిపోవాలనే నా ప్రయత్నం! నా శీలం చెడిపోయిందన్న బాధకంటె నేను వచ్చేస్తూవుంటే రవీంద్ర చెప్పిన మాటలు నాకు ఎక్కువ బాధ కల్గించేయి. ఉద్యోగం సంగతి అడిగితే ప్రస్తుతానికి ఆ సంగతి మరిచిపోమ్మన్నాడు. రాత్రి చెప్పిన తీయని కబుర్లన్నీ కలలుగా మిగిలిపోయాయి. నేనొకరాత్రి వాడికి సుఖాన్నందించి నందులకుగాను వంద రూపాయలు తీసికో మన్నాడు. మళ్ళీ డబ్బు అవసరంవస్తే ఫోన్‌చేసి హోటలుకు రమ్మన్నాడు!....” జ్వాల ఆ అప్రతిభురాలయి పోయింది.

రమ చెడిపోయిన విషయం కంటె కూడా రవీంద్ర ప్రవర్తన జుగుప్సగా తోచింది ఆమెకు.

“డర్టీ రోగ్!” పళ్ళు బిగించి ఈసడింపుగా అంది జ్వాల “ఆ డబ్బు తీసుకున్నావా?”

“నోటు తీసుకుని ముక్కలుచేసి వాడి మొహంమీదే గిరాటేశాను. నోటికివచ్చి నట్లల్లా తిట్టేను. తిట్లన్నీ చిరునవ్వుతో విన్నాడు. ఈ విషయం బయటకు చెప్పుకుంటే పరువుపోయేది ఆడదానికే కనుక నోరు మెదపకుండా వూరుకుంటే మంచిదని హితవుచెప్పి మరీ పంపించాడు.” అంది రమ.

“స్కౌండ్రల్! బెదిరింపుకూడానా? అవునులే! ఈదేశంలో ఆడదాని బ్రతుకే అలా తయారయింది. ఇలా ప్రతివిషయానికీ భయపడి మనం నోరుమెదపకుండా ఊరుకున్నంతకాలం ఈ దారుణ కాండ ఇలా సాగిపోతూనే వుంటుంది. ఈవేళ నువ్వు, రేపు రాధ, ఎల్లుండిమరో సుధ .... ఇలా రవీంద్రలాటి వ్యక్తులకు బలికావల్సిందే....” అంటూ క్షణంసేపు ఆగి “నువ్వు బాధపడకు. నీకుఅన్యాయం జరిగిందన్న సంగతి మరిచిపో! ఉద్యోగం ఏదో ఒకటి దొరక్కపోదు.” దాని సంగతి తరువాత ఆలోచిద్దాం! అంటూ లేచి బాత్‌రూంవైపు వెళ్ళింది జ్వాల.

పావుగంటలో స్నానంచేసి చీరకట్టుకుని ముస్తాబయింది జ్వాల.

“ఎక్కడికి బయలుదేరుతున్నావ్?” అడిగింది రమ.

“రవీంద్రా నీపుడ్స్‌కి”

“ఎందుకు!” భయంగా అడిగింది.

జ్వాల అక్కడకు వెళ్ళి గొడవచేస్తే తన పేరు బయటకు వస్తుందని భయపడింది రమ.

“రవీంద్రతో మాట్లాడాలి!”

“ఏం మాట్లాడతావ్?”

“నాకూ ఉద్యోగం కావాలి!”

“నీకు మతిపోయిందా జ్వాలా? ప్లీజ్ ఈ విషయం అనవసరంగా రోడ్డుకెక్కుతుంది!” భయంగా అంది రమ.

“నీ పేరు బయటకు రానివ్వను. ఆ అందగాణ్ణి ఓమారు చూడాలని వుంది! అందుకని!” అంటూ వేనిటీ బ్యాగు అందుకొని బయటకు నడిచింది జ్వాల.

రమ ఆశ్చర్యంతో నోరు తెరుచుకొని జ్వాల వెళ్ళినవంకే చూస్తుండి పోయింది.

* * *

“ప్లీజ్ కమిన్!” రివాల్వింగ్ చైర్‌లో విలాసంగా వూగుతూ అన్నాడు రవీంద్ర.

“నమస్తే” అంది జ్వాల వయ్యారంగా.

“నమస్తే!” అలా కూర్చోండి! వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ?” చిన్నగా నవ్వుతూ అడిగేడు.

“నాపేరు జ్వాల!....” క్షణంసేపు ఆగి రుమాలుతో చిరుచెమటను సుతారంగా ఒత్తుకుంది.

“నేను డైరెక్టుగా మీ అందాన్ని

మెచ్చుకుంటున్నందులకు మీరు ఏ మీ అనుకోకపోతే .. మీ అందమయిన బుగ్గల్ని చిదిమి దీపం పెట్టుకోవచ్చు. మీ పేరు జ్యోతి అయివుంటే బాగుం డేది!" అన్నాడు రవీంద్ర ఆమె వంక చూస్తూ. ఆ చూపులో ఏ భావమూ లేదు.

జ్వాల బుగ్గలు సిగ్గుతో అరుణిమ దాల్చాయి!

తరువాత మెల్లగా "జ్యోతి వెలుగు విస్తుంది. జ్వాల దహించేస్తుంది. అంతే తేడా!" అంది.

"మీరు కొంపదీసి తెలుగు బియ్యే కాదుగద! తెలుగు బియ్యే ఆడపిల్లల్తో మాట్లాడటానిక్కి నాకు మహా భయం. శ్లేషలతో మాట్లాడి చంపేస్తారు. ఎనీ వే వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ?" చేతి లోని పెన్ను కుషన్ మీద గుచ్చుతూ అడిగేడు.

"మాది గుంటూరు. వారం రోజుల క్రితం విశాఖపట్నం వచ్చాను. యూని వర్సిటీలో క్లార్కు పోస్టుకి ఇంటర్వ్యూ జరిగింది. రెండు పోస్టులంటే రెండు వందలమందిని పిలిచేరు. ఆ ఉద్యోగం వస్తుందని నా కేం నమ్మకం లేదు. ఇక్కడ మా బాబయ్యగారింట్లో వుండి ఉద్యోగంకోసం వెతుకుతున్నాను. మీ కంపెనీలో ఖాళీవుంటే సహాయం చేస్తా రని వచ్చేను." డైలాగులు వప్పజెప్పి నట్లు టకటక మాట్లాడింది జ్వాల.


"ఇంతకుముందు ఎక్కడయినా పని చేశారా?"

"ఖాళీగానే వున్నాను. డిగ్రీ పాసయి ఏడాదయింది. ఉద్యోగంతో ఇంట్లో వాళ్ళని పోషించాల్సిన అవసరం లేదు. కాని నా కాళ్ళమీద నేను నిలబడాలని ప్రయత్నం." చిరునవ్వుతో అంది.

"ఆడపిల్లలు అలా వుండటమే మంచిది. ఐ లైక్ యూ! అవ్‌కోర్స్ యువర్ ఐడియాస్".

ధైర్యవంతుడు తన జీవితాన్ని గురించి భయపడడు. అనుకొన్నది ధైర్యంగా చేస్తాడు. ఆ విధంగా ఉన్నది పోగొట్టుకొవటమో లేక లేనిది పొందమో జరుగుతుంది.

(జేమ్స్ గ్రాహం)




"మీరు భలే మాట్లాడతారు!" కిలకిల నవ్వుతూ అంది జ్వాల.

"జ్వాలా! నా పర్సనల్ స్టెనో పోస్టు ఖాళీగావుంది. అదిమీకిస్తాను....కాని...."

"నాకు చెప్పవచ్చు కాని షార్టుహేండు రాదు సార్! అంది అమాయకంగా జ్వాల.

"షార్టుహేండు మీరు కష్టపడి నేర్చు కున్నారంటే ఏడాదిలో 'పికప్' చెయ్యొచ్చు! కాని...."

"మీరేం సందేహించకండి సార్! ఎలాటి షరతులకయినా నేను సిద్ధమే! నా కిపుడు ఉద్యోగం కావాలి!" అనం దంగా అంది జ్వాల.

"ఒక చిన్న షరతు ...." అంటూ ఆగేడు రవీంద్ర.

"చెప్పండి. దేనికయినా సిద్ధమే!"

"తీరా చెప్పేక మీరు బాధపడ కూడదు!"

"బాధపడను సార్! మీరు చేయ బోయే సహాయానికి ఋణపడివుంటాను".

"సరే! చెప్తున్నా వినండి. ఇటీజె డీల్! మీకు నా కంపెనీలో ఉద్యోగం కావాలి! నాకు మీ కంపెనీ కావాలి! మీకు ఇష్టమయితే రాత్రిఏడున్నర గంట లకు కిన్నెర హోటల్‌కు వచ్చేయండి. త్రీస్టార్‌లో డిన్నర్ తీసుకుందాం. రాత్రికి ఇంటికి రావటం కుదరదని ఫ్రెండుఇంటికి డిన్నరుకు వెళ్తున్నావని మీ చుట్టాల ఇంట్లో చెప్పండి." మాటలు ఆపి జ్వాలలో 'రియాక్షన్' కోసం ఆమె ముఖంలోకి చూశాడు. జ్వాల మాట్లాడ కుండా తలదించుకుంది.

"మీకిష్టం లేకపోతే ఈ విషయం ఇక్కడే మరిచిపోండి. ఇటీజె డీల్! అంతే!" అన్నాడు.

రెండు క్షణాల నిశ్శబ్దం తర్వాత జ్వాల మెల్లగా రవీంద్ర కుడిచేతిని టేబులుమీద నుండి తనకు దగ్గరగా తీసుకుని సుతారంగా ముద్దుపెట్టుకుంది. ఆమె కనులు కాంతితో మెరుస్తున్నాయి.

ఆశ్చర్యపడటం రవీంద్ర వంతయింది.

"జ్వాలా!" అన్నాడు మెల్లగా గొణుగుతున్నట్లు.

"రవీంద్రా! నేను మిమ్మల్ని

ప్రేమిస్తున్నాను. మీతో సహచర్యం నా అదృష్టం! ....కాదు, పూర్వజన్మ సుకృతం." అంది జ్వాల తియ్యగా ప్రతిపదం ఒత్తిపలుకుతూ.

"థేంక్యూ జ్వాలా!" అన్నాడు రవీంద్ర.

"రవీంద్రా! మీ కళ్ళల్లో ఏదో ఆకర్షణశక్తి వుంది. ఎదుటి మనుషుల్ని కట్టిపడేసే దివ్యమయిన శక్తి మీ అందమయిన ముఖంలో, చూపుల్లో వుంది...., వాటిని తప్పించుకుని పారిపోవటం నాలాటిసామాన్య స్త్రీకిసాధ్యమా!" అంది.

రవీంద్ర గర్వంగా మరో చిరునవ్వు తన పెదాలపై కదిలించేడు.

"బై! సాయంకాలం కిన్నెరలో కలుద్దాం!" అంది జ్వాల కుర్చీలోంచి లేస్తూ.

"సాయంకాలం కళ్ళలో కాగడాలు వేసుకుని చూస్తూ వుంటాను. మీరొచ్చి వాటిని వెలిగించాలి."అన్నాడు రవీంద్ర.

"మీరు తెలుగు ఎమ్మే కాదుగద! తెలుగు ఏమ్మే మొగాళ్ళని ఏడిపించటమంటే నాకు సరదా!" అంటూ కిలకిల నవ్వుతూ బయటకు నడిచింది జ్వాల.

* * *

"జ్వాలా! ఈ క్షణాలు శాశ్వితమయిపోతే ఎంత బాగుంటుంది? ఐ లవ్ యూ!" రవీంద్ర కాస్త ముద్దగా మాట్లాడుతున్నాడు.

గదిలోని లేత నీలంబల్బు పల్చగా వెలుతురు పరుస్తోంది

గోడకు అమర్చివున్న క్రిస్టల్ ఏర్ కూలర్ మెల్లగా శబ్దం చేస్తూ చల్లని గాలిని గదిలో నింపుతోంది, గదిలో 'స్ప్రే' చేసిన 'ఛార్లీ' తీయని పరిమళం హాయిగా మత్తుగా వుంది.

మంచంమీద వెల్లకిలా పడుకున్నాడు రవీంద్ర.

అతని ప్రక్కనే కూర్చుని గుండెల మీద చుబుకం ఆన్చి అతని కళ్ళల్లోకి తదేకంగా చూస్తోంది జ్వాల.

"డియర్, నాకు ఉద్యోగం ఇవ్వటం ఖాయమేనా?" తీయగా అడిగింది. రవీంద్ర ఆమె కురుల్లోకి వేళ్ళుపోనిచ్చి సుతారంగా నిమిరేడు.

"ఒకవేళ ఇవ్వననుకో! నీకు కోపం వస్తుందా?"

"కోపం ఎందుకు? ఉద్యోగం వస్తే రోజంతా మీ కళ్ళల్లోకి చూస్తూ గడుపుదామని నా ఆశ!" గోముగా అంది జ్వాల.

రవీంద్ర గట్టిగా నవ్వేశాడు.

"అందుకే ఉద్యోగం ఇవ్వకూడదనుకుంటున్నాను. ఉద్యోగం అంటూ నీకిస్తే నువ్వు చేయాల్సిన డ్యూటీ బోలెడంత వుంటుంది. నా కళ్ళల్లోకి చూస్తూ కూర్చుండిపోతే కాగితాలన్నీ టేబిల్ మీదే వుండిపోతాయి. అందుకని నువ్వు ఉద్యోగం అడక్కుండా ఇలాగే నీకు కావాలనుకున్నప్పుడల్లా నాకు ఆపీసుకు ఫోన్ చేసి కిన్నెరకు వచ్చేస్తూవుంటే అద్భుతంగా వుంటుంది. నీకు పాకెట్ మనీ నేనిస్తాను. నీ కాళ్ళమీద నువ్వు నిలబడిన తృప్తికంటె నీ పరుపుమీద నువ్వు పడుకున్నప్పటి తృప్తి మరింత బాగుంటుంది కదూ!" అంటూ తన 'జోక్'కి తనే మరింత గట్టిగా నవ్వుతూ జ్వాలను దగ్గరగా లాక్కున్నాడు. జ్వాల సున్నితంగా అతన్ని విడిపించుకుంటూ, "మీరు భలే మాట్లాడుతారు రవీంద్రా! మీ తెలివితేటలు అమోఘం! నాకు ఉద్యోగం ఇవ్వకపోయినా పర్వాలేదు. మీలాంటి వ్యక్తితో గడిపేసిన తృప్తిచాలు జీవితాంతందాచుకోటానికి.. అబ్బ! అంత తొందరేమిటి? ఇంకా బోలెడు సమయం గడవాలి.... ఇంకో రౌండు స్కాచ్ వేసిఇవ్వనా?" అంది జ్వాల.

"జ్వాలా! నువ్వు దొరకటం నిజంగా అదృష్టమే! నీలాటి అందమయిన ఆడపిల్ల మరో 'రౌండు' సర్వ్‌చేస్తానంటే వద్దంటానా?" అంటూ జ్వాల భుజాలు రెండూ నొక్కేడు.

అతని చేతులనుండి విడిపించుకుని మంచంమీదనుండి లేచి మరో రౌండు స్కాచ్ గ్లాసులో వేసి రవీంద్ర చేత తాగించింది.

చిన్నకుర్రాడు పాలపీక తాగుతున్నట్లు గారంచేస్తూ గ్లాసంతా ఖాళీచేశాడు రవీంద్ర.

గ్లాసు టేబిలుమీద పెడుతూవుంటే "ఆలస్యం దేనికి? అడ్డు తీసెయ్యరాదూ?" అన్నాడు.

"అబ్బ! సిగ్గు బాబూ! మీరు గట్టిగా కళ్లుమూసుకోండి! నేను 'రెడీ' అనే వరకూ తెరవకూడదు!" అంది బుంగమూతి పెట్టి


"ఇదిగో! దేవి ఆజ్ఞ! ఇప్పుడే కళ్లు మూసుకుంటున్నా!" అంటూ గట్టిగా మూసిపట్టుకున్నాడు.

జ్వాల ఏమీ ఆలస్యంచేయకుండా టేబులుమీద వేనిటీబ్యాగు అందుకుని అందులోని ఒక సీసా బయటకు తీసింది. రవీంద్ర ముఖంవద్దకు వంగి "కళ్లు తెరవకూడదు అబ్బాయిగారు!" అంటూ సీసామూతతీసి అందులోని ద్రవం అతని ముఖంమీద నుదిటిమీద ఒంపేసింది.

రవీంద్ర కెవ్వున అరిచేడు.

"ఏమిటిది జ్వాలా? అబ్బ! మండిపోతోంది!" అంటూ అరిచేడు

"కళ్లు తెరవకు రవీంద్రా! తెరిచావంటే ఆ కళ్లు మరి ఎందుకూ పనికి రాకుండా పోతాయి. నేను నీ ముఖం మీద ఒంపిన ద్రవం పేరు సల్ఫ్యూరిక్ ఆసిడ్ అంటారు. $H_2So_4$ అన్నది దీని రసాయనిక నామం! 'వెనేడియం పెంటాక్సయిడ్' కెటలిస్ట్ వాడకంద్వారా దాన్ని 'కాంటాక్టు' ప్రోసెస్‌లో తయారు చేస్తారు. ఒక్కచుక్క కంట్లోపడితేచాలు. శాశ్వతంగా చూపుపోతుంది. అందుకని



కళ్లు తెరవకు! ముఖంమీద పడితే కేవలం కాలిపోయిన మచ్చలు మాత్రమే మిగిలి నీ అందమయిన ముఖాన్ని వికారంగా తయారుచేస్తాయి.... ఆ! అలా చేతుల్తో తుడవకు! చేతులు బొబ్బలెక్కి— అంటూ వివరాలన్నీ చెప్తూ హేళనగా నవ్వుతూ దూరంగా వచ్చి తలుపు దగ్గర నిలబడింది జ్వాల.

"విన్న, విన్ను.... ఐ విల్ కిల్ యూ!" అంటూ హాహాకారాలు చేస్తూ లేవబోయి బాధతాళలేక మళ్ళీ మంచంమీద పడిపోయేడు రవీంద్ర.

"డియర్! నీ ప్రాణానికి ఏమీ భయం లేదు. కాని నీ ముఖం మరెందుకూ పనికిరాదు. ఇకమీదట నాలాగ ఏ ఆడపిల్లా నీ వ్యామోహంలో పడిపోయి శలభంలా మాడిపోకుండా ఈపని చేశాను. తనకు అన్యాయం జరిగిన ఏ ఆడపిల్లా ఈ సమాజంలో రోడ్డునపడి చెప్పుకోలేదు! అందుకే నీలాటి దౌర్భాగ్యుల ఆటలు సాగుతున్నాయి. నీలాంటివాళ్ళ ఆకర్షణలో పడి, అవసరార్థం మానాన్ని బలిపెట్టుకోవలసిన పరిస్థితికూడా ఏర్పడుతోంది. నువ్వుచేస్తున్న అన్యాయాలు ఏ కోర్టులోనూ ఋజువుకావు! ఏ చట్టమూ నిన్ను శిక్షించలేదు! నీ కాసంగతి బాగా తెలుసు! అందుకే నీ తెలివితేటల్తో ఆడపిల్లల్ని మోసంచేస్తున్నావు.

"జ్వాల అనే అమ్మాయిని బలవంతం చెయ్యబోతే ఇలాచేసిందని ఏ కోర్టులో చెప్పుకుంటావో చెప్పుకో! నీ పాపం పండే రోజు వచ్చింది! బై! త్వరలో కలుద్దాం!" అంటూ తలుపు తెరచుకుని గబాగబా అడుగులు వేసుకుంటూ బయటకు వెళ్ళిపోయింది జ్వాల!

రవీంద్ర మూలుగు ఆమెకు వరండా చివరివరకూ విన్పిస్తూనే వుంది.

———